క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా



వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

చందుర్తి: మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ చందుర్తి ఎమ్మార్వో కార్యాలయంలో ఎదుట ఆందోళన చేపట్టి ఎమ్మార్వోలకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మండల మధ్యాహ్న భోజన కార్మికులు మర్రి విజయ, పిట్టల లచ్చయ్య, లింగంపల్లి లక్ష్మి, గడ్డం మల్లవ్వ పాల్గొన్నారు.

ఓటర్ అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో బుధవారం ఓటరు అవగాహనా సదస్సు నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాట్‌ల పనితీరును ప్రదర్శించారు. ఓటు వేసిన తర్వాత సరిగా పడిందా లేదాని వీవీ ప్యాట్ ద్వారా చూసుకోవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. మొదటగా ఈవీఎంపై నీలిరంగు బటన్ నొక్కాలని, ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్‌పై పేపర్ స్లిప్‌ను నిర్ధారించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు మధుర, శోభ, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలి



మాట్లాడుతున్న కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు మల్లేశం

వేములవాడరూరల్: జిల్లాలో ఉన్న కబడ్డీ క్రీడాకారులకు ప్రభుత్వపరంగా ప్రత్యేక శిక్షణ అందించాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చొప్పరి మల్లేశం అన్నారు. వేములవాడ పట్టణంలో బుధవారం నిర్వహించిన జిల్లా అసోసియేషన్ ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో నిర్వహించిన క్రీడా మైదానాల్లో ప్రభుత్వపరంగా గ్రామీణ ప్రాంత యువతకు ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. వేములవాడ పట్టణంలో నిర్మాణమవుతున్న మినీ స్టేడియంలో కబడ్డీ అకాడమి ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ స్థాయిలో పథకాలు పొందిన క్రీడాకారులకు ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి ఇచ్చి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపి స్టేడియం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ప్రభాకర్, మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల వెంకటేశ్, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ కార్యదర్శి జోగినిపల్లి రవీందర్‌రావు, సిరిసిల్ల మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, మనోజ్ పాల్గొన్నారు.

జాబిల్లిని తాకిన క్షణం..
ఆనంద డోలికల్లో జనం

• శాస్త్రవేత్తలకు అభినందనలు • పాఠశాలల్లో ప్రత్యక్ష వీక్షణలు • వీధి, వీధిన సంబరాలు

ఇస్రో శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టిన చంద్రయాన్–3 విజయవంతం కావడంతో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు, నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. టీవీలో చంద్రయాన్‌ను ఆసాంతం చూస్తూ గడిపారు. ల్యాండర్ విక్రమ్ జాబిల్లిని తాకిన క్షణంలో విద్యార్థులు 'జయహో ఇస్రో, జయహో ఇండియా' అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు.

వేములవాడ/వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అగ్రహారం శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వేములవాడ కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులకు చంద్రయాన్–3 ల్యాండింగ్‌ను లైవ్ వీక్షణకు కళాశాల యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్, కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ధరక్షన్ వస్ప్రియా, డైరెక్టర్ ఫణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజన్నకు కోడె మొక్కు

చంద్రయాన్–3 విజయవంతంగా ల్యాండింగ్ కావడంతో వేములవాడ రాజన్న ఆలయ ఉద్యోగులు బుధవారం రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ శేఖర్, రాంకిషన్‌రావు, నాగరాజు, వర్ధన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇస్రో ఆకృతిలో కూర్చుని శాస్త్రవేత్తలు అభినందనలు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చంద్రయాన్–3 విజయోత్సవాలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ సెక్రెటరీ గడ్డం వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.



వేములవాడఅర్బన్: చంద్రయాన్ 3 ల్యాండింగ్‌ను లైవ్‌లో వీక్షిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో బీజేపీ పట్టణాధ్యక్షుడు మెంగని మహేందర్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం రాత్రి సంబరాలు నిర్వహించారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబురాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని మహాలక్ష్మికాలనీ వాసులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో సర్పంచ్ పాటి దినకర్ ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.



ఎల్లారెడ్డిపేటలో సంబరాలు



ముస్తాబాద్‌లో..



రుద్రంగిలో..



దుమాలలో ఇస్రో ఆకృతిలో విద్యార్థులు

సీఎంను కలుసుకున్న చల్మెడ



వేములవాడ: సీఎం కేసీఆర్‌ను బుధవారం వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై చర్చించినట్లు తెలిసింది.

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

సిరిసిల్లఅర్బన్: కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన, సిరిసిల్ల పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కారంగుల వినోద్‌కుమార్ భార్యకు బుధవారం నీలిమకు రూ.లక్ష చెక్కును మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అందజేశారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఅండ్‌పీఆర్ కమిషనర్ అశోక్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంగోపాల్, లాయక్‌పాషా, బిజిగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు చోటివ్వద్దు



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: అసాంఘిక శక్తులకు చోటివ్వద్దని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శశిధర్‌రెడ్డి కోరారు. మండలంలోని అల్మాస్‌పూర్‌లో బుధవారం గ్రామపంచాయతీ ముందు పోలీస్ కమ్యూనిటీ మీటింగ్ ఏర్పాటు చేశారు. సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. అదేవిధంగా గ్రామ శివారులో ఉన్న సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సై రమాకాంత్, పోలీస్ సిబ్బంది, సర్పంచ్ పుష్పలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ఇవ్వాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఐఆర్‌ను ఇచ్చేందుకు పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్రసాద్‌గౌడ్ అన్నారు. సంఘ సభ్యత్వ సేకరణలో భాగంగా పాఠశాలల ఉపాధ్యాయులతో మాట్లాడారు. న్యాయస్థానం ద్వారా ఉపాధ్యాయ బదిలీ పదోన్నతులు పూర్తి చేయాలని కోరారు. 317 జీవో ద్వారా స్థానికత నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు పోతుగంటి రమేశ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజం, జిల్లా కౌన్సిలర్ గుగులోతు రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

అందుబాటులో..
అధునాతన వైద్యం

ఇల్లంతకుంట: దశాబ్దాల కల నిజమైంది. ఇల్లంతకుంట మండల కేంద్రంలో 50 పడకల ఆస్పత్రి మంజూరుకావడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. వైద్యానికి దూరంగా ఉన్న ఈ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలకు వందల సార్లు విజ్ఞప్తి చేసినా ఫలితంగా లేకుండా పోయింది. కాని ఏకంగా 50 పడకల ఆస్పత్రి మంజూరు చేసినట్లు ప్రకటించడంతో సంతోషం వెల్లివిరిసింది.



ఇల్లంతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ఇల్లంతకుంటకు ఏకంగా 50 పడకల ఆస్పత్రి మంజూరు
- రూ.17.50 కోట్ల అంచనా వ్యయం
- దశాబ్దాల కల నెరవేరిన వైనం
- 33 గ్రామాలకు ప్రయోజనం

మండలంలోని 33 గ్రామ పంచాయతీలు, 15 అనుబంధ గ్రామాలు, సుమారు 70 వేల వరకు జనాభా ఉంది. ప్రస్తుతం మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీ కేవలం మూడు పడకలకు మాత్రమే పరిమితమైంది. దీంతో ఈ ప్రాంతంలో ప్రజలకు ఏ ఆపద వచ్చినా వైద్యం కోసం 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేటకు వెళ్లాల్సిన పరిస్థితి. ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసరంగా వైద్య సహాయం అందక ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. నాలుగున్నరేళ్ల క్రితం రైతుబంధు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌కు స్థానిక ఎమ్మెల్యే 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. కాని 20 రోజుల క్రితం 30 పడకల ఆస్పత్రి మంజూరు చేస్తూ ఒక జీవో విడుదలయ్యింది. ప్రస్తుత పరిస్థితుల్లో 30 పడకల ఆస్పత్రి సరిపోదని ఆలోచించి ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంజూరైన 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని సభ దృష్టికి తీసుకువస్తారు. దీంతో సీఎం స్పందించి వెంటనే ఆదేశాలు జారీ చేయడంతో, ఈనెల 9న 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నట్లు జీవో విడుదలయ్యింది.

మెరుగైన వైద్యం

దశాబ్దాల కాలంగా మండల ప్రజలు చిన్న జబ్బుకైనా వైద్యం కోసం కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల వంటి ప్రాంతాలకు వెళ్లి దూరప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునేవాళ్లు. మండల విస్తీర్ణం, జనాభా పెరగడంతో ఈ ప్రాంత ప్రజలకు సర్కారు వైద్యం అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఎట్టకేలకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలితాన్చాయి. రూ.17.50 కోట్ల అంచనా వ్యయంతో 50 పడకల ఆస్పత్రి మంజూరు చేస్తూ జీవో విడుదల కావడం ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆసుపత్రి అనుకున్న సమయానికి, ఎలాంటి అడ్డంకుల లేకుండా పూర్తయితే మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందనుంది. 50 పడకల ఆస్పత్రిలో 11 మంది వైద్యులతో పాటు, 50 మంది సిబ్బందితో పాటు అన్ని రకాల ఆధునాతన వైద్య సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

❐ 50 పడకల ఆసుపత్రిలో..

11మంది డాక్టర్లు ఉంటారు. వారిలో జనరల్ మెడిసిన్, ఆర్థోఫిజీషియన్, జనరల్ సర్జన్, గైనిక్ స్పెషలిస్ట్, అనస్థీసియా డాక్టర్ల బృందం ఉంటుంది. అలాగే అదనంగా 50మంది సిబ్బంది ఉంటారు.

కల నెరవేర్చాం



ఏళ్లుగామండల ప్రజలు ఎదురుచూస్తున్న ఆస్పత్రి కల నెరవేర్చాం. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో మొదట 30 పడకల ఆస్పత్రి చేయాలని కోరాం. కాని ప్రస్తుతమున్న పరిస్థితిలో 30 పడకల ఆస్పత్రి సరిపోదని, అసెంబ్లీలో 50 పడకల ఆస్పత్రి మంజూరు కోరిన వెంటనే సీఎం కేసీఆర్ స్పందించి, ఆదేశాలివ్వడంతో జీవో జారీ చేశారు. – రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే

రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్లుగా 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలకు వందల సంఖ్యలో వినతిపత్రాలు ఇచ్చాం. కాని ఎమ్మెల్యే రసమయి ఇచ్చిన మాటకు కట్టుబడి, ఎంత కష్టమైనా 50 పడకల ఆస్పత్రినే మంజూరు చేయించారు. ఎమ్మెల్యేకు ఈ ప్రాంతం ఎప్పటికీ రుణపడి ఉంటుంది
– కూనబోయిన భాగ్యలక్ష్మి, సర్పంచ్, ఇల్లంతకుంట

నాణ్యమైన వైద్యం అందుతుంది



స్థానిక పీహెచ్‌సీలో కేవలం మూడు పడకలది మాత్రమే కావడంతో రోజుకు ఆస్పత్రికి 200 మంది వరకు వైద్యం కోసం వస్తుంటారు. పెద్ద మండలం కావడం, ఆస్పత్రి స్థాయి చిన్నగా ఉండటంతో ఎమ్మెల్యే పట్టుబట్టి 50 పడకల ఆస్పత్రి మంజూరు చేయించారు. ప్రజలకు మెరుగైన సర్కారు వైద్యం అందనుంది.
– ఒగ్గు నర్సయ్య, ఎంపీటీసీ, ఇల్లంతకుంట

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అయ్యన్నగారి లింగారెడ్డి (70) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

ప్రమాదానికి గురైన యువకుడి మృతి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బైపాస్ రోడ్డు మంగళవారం రాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సందలగిరి వాసు(19) బుధవారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. సిరిసిల్ల బైపాస్ మీదుగా రగుడువైపు అభి అనే మరో యువకుడితో వెళ్తుండగా, బైక్ అదుపు తప్పి కిందపడగా, వాసుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

చందుర్తి: స్థానిక ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వాస్థ్ కార్యక్రమం)లో భాగంగా వైద్యాధికారి ప్రభాకర్ బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు.

పీజీ ప్రవేశ పరీక్షలో మెరిసిన విద్యార్థులు

వేములవాడఅర్బన్: ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర వివిధ పీజీ ప్రవేశ పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. పున్నశాస్త్రి ఎంఎస్సీ ఫిజిక్స్ ఎంట్రెన్స్‌లో 101 ర్యాంక్. లాసెట్ ఎంట్రెన్స్‌లో రిషింద్ర 1687 ర్యాంక్. ఎడ్‌సెట్ ఎంట్రెన్స్‌లో ఎండీ మేహ అత్యుత్తమ ఫలితాలు సాధించారు. అలాగే ఐసెట్ ఎంట్రెన్స్‌లో దేవేందర్, సమీర్, వేణు, సంజీవ్, ఎంఎస్సీ జంతుశాస్త్రం ఎంట్రెన్స్‌లో రమ్య, ఎంఎస్సీ గణిత శాస్త్రం ఎంట్రెన్స్‌లో నికిత, ఎంఏ తెలుగు ఎంట్రెన్స్‌లో కేజీయా, సుప్రియ, కళ్యాణి, జోస్న, ఎంఏ రాజనీతిశాస్త్రం ఎంట్రెన్స్‌లో సుస్మిత, సంతోష, ఎంఏ ఇంగ్లీష్ ఎంట్రెన్స్‌లో సనా, జావేద్ విద్యార్థులు ఫలితలను సాధించారు. వీరిని అధ్యాపకులు అభినందించారు.



సుప్రియను అభినందిస్తున్న యాజమాన్యం

వికాస్ విద్యార్థికి 14వ ర్యాంక్

సిరిసిల్లటౌన్: ఎంఎస్సీ స్టాటిస్టిక్స్‌లో వికాస్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థిని చెన్నవేణి సుప్రియ రాష్ట్రస్థాయిలో 14 ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం దిడ్డి శ్రీనివాస్, గుగ్గిళ్ల జగన్‌గౌడ్, శాతవాహన యూనివర్సిటీ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్ విద్యార్థినిని అభినందించారు.

దివ్యాంగుల హర్షాతిరేకం

ఎల్లారెడ్డిపేట: దివ్యాంగుల పింఛన్ రూ.4,016కు పెంచడాన్ని స్వాగతిస్తూ ఎల్లారెడ్డిపేటలోని పాత బస్టాండ్‌లో బుధవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చిత్రపటాలకు బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంగూరి బాబు, మండల అధ్యక్షుడు రాగుల మల్లారెడ్డి మాట్లాడుతూ వికలాంగుల కష్టాలు తెలిసిన సీఎంకు రుణపడి ఉంటామన్నారు. వికలాంగుల హక్కు నాల్వే 2016 పెన్షన్ పెంచినందుకు రానున్న ఎన్నికల్లో వికలాంగులందరం బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఉంటామన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు వికలాంగుల గురించి పట్టించుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ మాత్రం వికలాంగులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు అల్లం లక్ష్మణ్, రామచంద్రం, కృష్ణారెడ్డి, పర్శరాములుగౌడ్, జాకీర్, భాగ్య,పాముల గోపి, గణేశ్‌గౌడ్, సంజీవ్ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో చిత్రపటాలకు క్షీరాభిషేకం

గంభీరావుపేట: దివ్యాంగుల ఆసరా పెన్షన్‌ను రూ.4016కు పెంపుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దివ్యాంగులు గంభీరావుపేట మండలంలో బుధవారం సంబురాలు నిర్వహించారు. నాగంపేట, లింగన్నపేటలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. దివ్యాంగులు ఒకరినొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మూడు నెలలు కష్టపడి పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దిగంత కవిత

ఇల్లంతకుంట: తెలంగాణ రాష్ట్రంలో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఈ మూడు నెలల పాటు బీజేపీ కార్యకర్తలందరూ సైనికుల్లా కష్టపడి పార్టీ కోసం పని చేయాలని అస్సాం రాష్ట్రంలోని కమలాపూర్ ఎమ్మెల్యే దిగంత కవిత అన్నారు. మండల కేంద్రంలో ప్రవాస్ అభియాన్ యోజన కార్యక్రమంలో మాట్లాడారు. మానకొండూర్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ జెండా ఎగరాలంటే కార్యకర్తలందరూ సంఘటితంగా పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, పాల్గొన్నారు.

ఎంఈవో తనిఖీ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని సరస్వతి ప్రైవేట్ స్కూల్లో బుధవారం ఎంఈవో దూస రఘుపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో ఈ పాఠశాలపై విద్యార్థి సంఘాల నాయకులు పలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఒకే స్కూల్ పేరుతో పలు ప్రైవేట్ స్కూళ్లు ఒకేచోట అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని ఏబీవీపీ విద్యార్థి నాయకులు ధర్నా నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలం హరిదాస్‌నగర్ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ ఖాజామొయినోద్దీన్‌కు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.ఒక లక్ష చెక్కును జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు బుధవారం అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మండల ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ తిరుపతిబాబు ,సర్పంచ్ కొల అంజమ్మ బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన గొట్టె నవమి, గడ్డం శారద, కోల దేవవ్వ, షహజాద్ మహమ్మద్‌కు ఒక్కొక్కరికి రూ.1,00,116 విలువైన చెక్కులను అందించారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట: కడుపేదరికం అనుభవిస్తూ బుధవారం మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన ఆకుల లక్ష్మి అంత్యక్రియలకు సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

రుంజాల నోబుల్ జయంతి

గంభీరావుపేట: కార్గిల్ యుద్ధ వీరుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రుంజాల నోబుల్ జయంతిని ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం , కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెరక జోసెఫ్ నిర్వహించారు.

సెస్ ద్వారా రూ.40 వేల ఆర్థికసాయం

బోయినపల్లి: మండల కేంద్రానికి చెందిన గుంటి లచ్చవ్వ పాడి ఆవు విద్యుత్ షాక్‌తో గతంలో మృతి చెందగా బుధవారం సెస్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం రూ.40 వేల చెక్కును మండల సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ బాధితురాలు లచ్చవ్వకు అందించారు. కార్యక్రమంలో సెస్ ఏఏఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు ప్రారంభం

వీర్నపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ మైదానంలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలను సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్ ప్రారంభించారు.

కరపత్రాలు ఆవిష్కరణ

సిరిసిల్లఅర్బన్/ఇల్లంతకుంట: మణిపూర్ అకృత్యాలకు వ్యతిరేకంగా ఈనెల 25న సిరిసిల్లలో నిర్వహించే సభకు సంబంధించి కరపత్రాలను సిరిసిల్లలో మాల మహానాడు అధ్యక్షుడు రాగుల రాములు, ఇల్లంతకుంటలో తెలంగాణ రాష్ట్ర దళిత సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సావనపెల్లి రాకేశ్ బుధవారం ఆవిష్కరించారు.

ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడిగా రాము

చందుర్తి: వేములవాడ నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా చందుర్తి మండలం మల్యాల గ్రామానికి పల్లికొండ రామును నియమించినట్లు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఓ ప్రకటనలో తెలిపారు.

గాలికుంటు వ్యాధి టీకాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలో పశువైద్య శిబిరాల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఏడు వేల పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారిణి రేణుక అన్నారు. బుధవారం పశువైద్య శిబిరంలో ఉప సర్పంచ్ ఒగ్గు రజిత, ఎంపీటీసీ అనసూయ, పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో వైకుంఠ రథం

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామంలో పంచాయతీ నిధులతో వైకుంఠ రథం కొనుగోలు చేశారు. సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ సువర్ణ పాల్గొన్నారు.